# 10

# ప్రభువు దినము

## (1 థెస్సలొనీకయులకు 5:1-11)

విశ్వాసులైన క్రైస్తవులకు యేసు రాకడ నిరీక్షణను యిస్తుంది. ఇది భవిష్యత్ కొరకు నిరీక్షణ అందించును గనుక ఇది యిప్పుడు సమాధానమును మరియు ఆదరణను యిస్తుంది.

యేసు రాకడకొరకు ఆశిస్తుండగా మనము ఆ గొప్ప దినము కొరకు సిద్ధపడుతూ జీవించవలెను. థెస్సలొనీకయులకు వ్రాసిన పత్రిక 5వ అధ్యాయము యొక్క మొదటి భాగము ఈ విషయమును గూర్చి మాట్లాడుచున్నది. థెస్సలొనీకయాలోని క్రైస్తవులను ప్రోత్సహించుటకు యేసు రాకడను గూర్చిన చర్చ చేర్చబడెను; యిట్టి ప్రోత్సాహము వారికి క్రీస్తు రాకడను గూర్చి తెలియదని లేదా వారు భక్తిహీనతతో కూడిన జీవితములను జీవించుచున్నారని మరియు యేసు రాకడకు సిద్ధముగా లేరనే ఉద్దేశముతో చర్చించలేదు. ఈ భాగము ఈ విధముగా ప్రారంభమగుచున్నది, "ఆ కాలమను గూర్చియు ఆ సమయములను గూర్చియు మీకు వ్రాయనక్కరలేదు" (5:1బి) మరియు వారికి యేసు రాకడను గూర్చి తెలుసునని మరియు మంచిగా జీవించుచున్నారని చూపిస్తూ దీనితో ముగిస్తుంది, "కాబట్టి మీరిప్పుడు చేయుచున్నట్టుగానే యొకనినొకడు ..." (5:11సి). వారు అప్పటికే ఎరిగియున్నదానిని మరియు వారు అప్పటికే చేయుచున్నదానిని ఆధారముచేసుకొని మరింత ప్రభావవంతముగా జీవించులాగున అభివృద్ధిచెందమని పౌలు థెస్సలొనీకయులను ప్రోత్సహించుచున్నాడు.

యేసు రాకడను గూర్చి మనమెంత ఎక్కువగా అర్థము చేసుకొని తెలుసుగొనగలమో అంత బాగుగా మనము మన జీవితములను తెలివిగా ఉపయోగించగలము మరియు ఆ రాకడకొరకు సిద్ధముగా ఉండగలము. యేసు రాకడ ఎట్లుండును? మరియు మనమెట్లు సిద్ధముగా ఉండగలము?

### ఆయన రాకడ కొరకు సిద్ధముగా యుండుడి! (5:1-3)

పౌలు, సిల్వానును, మరియు తిమోతియు వారి ప్రసంగాలలో యేసు రాకడను గూర్చిన విశ్వాసనీయతను బోధించిరి. అదే విధముగా వారు ఆయన రాకడ సమయమును గూర్చి అనిశ్చియతను గూర్చి జ్ఞాపకము చేసిరి. ఈ రెండు సందేశములు కూడ థెస్సలొనీకయాలోని క్రైస్తవుల ద్వారా అంగీకరించబడినవి (5:1).

కొన్నిసార్లు ఉపదేశకులుగా మనము ఏదైనా ఒక అంశముపైన బోధించిన తరువాత బోధ అవసరము లేదని, ఒకవేళ అదే సందేశమును తిరిగి బోధిస్తే సహోదరులు ఆసక్తి చూపరని అనుకుంటుంటాము. ఈ సందేశము అవసరములేనిదిగాదు, లేదా విసుగుపుట్టించునది కాదు; ఇది దేవుడు మరలా మరలా బోధించాలని కోరుకున్న సందేశము. ఇది సంఘము పరిపూర్ణము చెందుటకును మరియు అభివృద్ధి చెందుటకును సహకరించును.

ఈ సందేశము ఏమిటి? ఇది ఏమైయున్నదనగా, రాత్రివేళ దొంగ ఏలాగు వచ్చునో అలాగే ప్రభువు దినము ఆకస్మికముగా వచ్చును (5:2). యేసు రాకడను ముందుగా

ప్రవచించిన మత సంబంధమైన గురువులు ఈ వాక్య భాగమును ఒప్పుకొననివారుగా యున్నారు. వారు చెప్పుకొన్నవి కేవలము వట్టి మాటలు మాత్రమే. ఎవరైతే అటువంటి ప్రకటనలను అనుసరించుదురో వారు విశ్వాసమును దేవుని యొక్క వాక్యమునందు యుంచక, మనుష్యునియందు ఉంచియున్నారు. వారు తప్పక నిరుత్సాహపడుదురు. దీనికి వ్యతిరేకముగా ఈ క్రైస్తవులు యేసు రాకడను గూర్చిన ఖచ్చితత్వమును మరియు అది సంభవించబోవు అనిశ్చయ సమయమును గూర్చిన దేవుని సందేశమును విశ్వసించిరి.

థెస్సలొనీకయులు క్రైస్తవులైనప్పుడు, యేసు వారిని రక్షించునని వారు ఎరుగుదురు. వారు దేవుని కృపలో ఉండి రాబోవు ఉగ్రతనుండి తప్పించుకొందురని వారికి తెలియును (1:10). యింకొంతమంది యేసు మరలా రాడని మరియు వారు తమ పాపములకు లెక్క ఒప్పచెప్పవలసిన అవసరంలేదని ప్రకటించుకొనుచున్నారు. వారి భద్రతను ఏదియు భయపెట్ట లేదని వారనుకొనుచున్నారు. యేసుని రాకడ అవిశ్వాసులకు శిక్షను, నాశనమును తెచ్చును. గర్భిణి స్త్రీకి ప్రసవ వేదనవలే ఇది ఆకస్మికముగా వచ్చును (5:3). తనయందు విశ్వాసముంచిన వారిని కొనిపోవుటకు యేసు వచ్చును. ఎవరైతే విశ్వాసములేకయుండిరో వారు పాపము యొక్క ఫలితమునకు విడిచిపెట్టబడుదురు.

యేసు యొక్క ఆకస్మిక రాకడ ఈ క్రైస్తవుల గుంపును విధేయత కలిగియుండునట్టుగా భయపెట్టే ఉద్దేశముతో జ్ఞాపకము చేయబడలేదు. ఆ విషయమును గూర్చిన సత్యమును వారు బాగుగా ఎరిగియున్నారు. ఈ సందేశము యొక్క ఉద్దేశమేమనగా, దేవుని పక్షమున ఉండుటవలన వచ్చు ప్రయోజనాలను గూర్చి అభయమిచ్చుటకును మరియు వారి ఆత్మీయ సంరక్షణగావించుటకు యేసునకు అవకాశం కలిగించుటకు ఈ మధ్యలో, వారు యేసు కోరుకొనిన ప్రకారము వారు తమ జీవితములను సాగించుదురు.

యేసు రాకడ నిజమని మనం నమ్ముతున్నామా? ఇది ఏ సమయములోనైనను జరుగవచ్చునని మనము గ్రహించామా? మనము మన దైనందిక జీవితాలలో దీనిని మనస్సున ఉంచుకొనియున్నామా? ప్రతి వారము మరియు ప్రతి దినము మనకు మనము ఈ గొప్ప సత్యమును జ్ఞాపకము చేసుకొనుట ఎంతో మంచిదిగా ఉండును!

### వెలుగు సంబంధులుగా ఉండుడి! (5:4–7)

క్రొత్త నిబంధనలో, పగలు మరియు వెలుగు అనేవి తరుచూ దేవునితో సంబంధం కలిగియుండేవి; చీకటి మరియు రాత్రి అనేవి సాతానుతో సహవాసము కలిగినవి. దేవుడు వెలుగైయున్నాడు; ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు అని మనకు చెప్పబడినది (1 యోహాను 1:5బి). యేసు "లోకమునకు వెలుగా" పిలువబడ్డాడు (యోహాను 8:12). ఎవరైతే దేవునిని వెంబడించుదురో వారు "వెలుగు సంబంధులని" చెప్పబడెను (ఎఫెసీయులకు 5:8). దీనికి వ్యతిరేకముగా, సాతాను "అంధకార సంబంధమైన అధికారము" కలిగియుంది (కొలొస్సయులకు 1:13), మరియు వానిని అనుసరించువారు "చీకటిలో నడుచువారు" (యోహాను 12:35).

ఈ భావాలు దేవుని స్వభావముకును మరియు సాతాను స్వభావముకును మధ్యగల వ్యత్యాసమును ప్రత్యేకపరచి చూపుచున్నాయి. దేవుని మాటలు ఎల్లప్పుడు సత్యము (యోహాను 17:17), కాని సాతాను అబద్ధికుడు మరియు అబద్ధమునకు జనకుడైయున్నాడు

(యోహాను 8:44). దేవుడు మనలను స్వీకరించియున్నాడు కాబట్టి క్రైస్తవులముగా మనము "వెలుగు సంబంధులము, పగటి సంబంధువులమైయుండవలెను" (5:5ఎ).

దేవునికి మరియు సాతానుడికి మధ్య వ్యత్యాసమున్నట్టే, దేవుని పక్షమున ఉన్నవారికిని మరియు సాతాను పక్షమున ఉన్నవారికి మధ్య వ్యత్యాసము ఉండవలెను (5:5బి–7). మనము పరలోకములో ఉన్న మన తండ్రి యొక్క నిజమైన శిష్యులమైనట్టయితే; మనము ఆయన పోలి ఉందుము. మనము ఎలా మన తండ్రిని పోలియుందుము? మనము వ్యవహరించు విధానమును బట్టియే! ఈ విధానము "మెళుకువగా ఉండుట, మరియు మత్తులుకాకుండుటగా" (6బి వచనం) వర్ణించబడినది. ఒక నిర్లక్ష్యపు వైఖరి లేదా మత్తు కలిగిన మనస్సు ఏ విధముగా వ్యవహరించాలో సరియైన నిర్ణయమును తీసుకొనుటను కష్టతరము చేయును.

థెస్సలొనీకయాలోని పరిస్థితిని ఒకసారి ఊహించండి: క్రైస్తవులైనవారు వారి విశ్వాసమునుబట్టి హింసించబడిరి. వారు దేవునిని అనుసరించకుండినట్టు వారిని మళ్ళించుటకు సాతాను తాను ఉపయోగించగలవాటినన్నింటిని ఉపయోగిస్తున్నాడు. ఒకని మనస్సు సిద్ధముగా యుండకుండినట్టయితే, మరియు తన సహజ శక్తులపై నియంత్రణ కలిగియుండకుండినట్టయితే ఒకడు చాలా సులువుగా ఒక విగ్రహమును ఆరాధించుటకును లేదా ఒక అబద్ధ దేవుని ఆరాధించుటకును, గౌరవించుటకును లోపరచబడును! ఒకని చుట్టూ ఉన్నవారి అవినీతి క్రియలలోను, భక్తిహీనతలలోను పాల్గొనుట ఎంత సులభమో! పాత జీవిత మార్గాలలోనికి జారిపోవుట చాలా సులభము మరియు సర్వ సాధారణము.

ఈ క్రైస్తవులు తమ చుట్టూ ఉన్న శోధనలను నిరోధించులాగున మరియు ప్రతి మాట మరియు క్రియయు నిజమైన దేవునిని గౌరవించులాగున మెళుకువగా ఉండవలసినవారైయున్నారు. వారు ప్రత్యేకమైనవారు; కాబట్టియే ప్రజలు వారిని హింసించిరి; కాని వారు ఎవరి యొక్క పిల్లలో తెలియజేసారు – దేవునియొక్క పిల్లలని.

మన గూర్చి ఏమిటి? మనము మెలుకువ కలిగి మత్తులము కాకుండాయున్నామా? లేదా మన డబ్బును జూదమాడుటకును, దేవుని నామమును వ్యర్థముగా ఉచ్చరించుటకును, లేదా యితరులు ఈ విధమైన కార్యకలాపాలలో పాలుపొందుచున్నారు కాబట్టి, మనము మన ఉద్యోగులను మోసము చేయులాగున చాలా సులువుగా లోపరచబడుచున్నామా? అనేకులను ఆకర్షించునటువంటి సాతాను యొక్క ప్రయోజనము లేని మరియు నాశనకరమైన ఆటలలో మనలను మనము ఉంచుకొనకుండినట్టయితే మనము నిలిచియుందుము.

మనము మెళుకువగా మరియు మన ఆలోచనలపై నియంత్రణ కలిగియుండాలనుకుంటున్నాము కాబట్టి మనము మత్తు పదార్థములను మరియు మత్తు పానీయాలను తిరస్కరించినట్టయితే మనము ప్రత్యేకముగా కనబడుదుము. చెడ్డ మాదిరిని ఏర్పరుచునటువంటి లేదా మన ప్రభావమును బలహీనపరచునటువంటి ప్రదేశాలకు వెళ్ళకుండునట్లు నిశ్చయించుకొనినట్టయితే మనము నిలిచియుందుము. చీకటి లోకములో మనము వెలుగు సంబంధులవలే జీవించినట్టయితే మనము గుర్తించబడుదుము. ఫిలిప్పీలో ఉన్న క్రైస్తవులకు చెప్పిన విధముగా, "మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులను సంశయములను మాని ... అట్టి జనము మధ్యను, మీరు జీవవాక్యమును చేత పట్టుకొని, లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు" (ఫిలిప్పీయులకు 2:15).

అప్పుడు, ఇప్పుడును క్రైస్తవులు దేవుని పోలియుండుటకును, యేసు జీవించినట్టు జీవించుటకును, "దేవుని ప్రియమైన పిల్లలువలె, దేవుని పోలి ఉండునట్లుగా" (ఎఫెసీయులకు 5:1) సవాలు చేయబడినారు. మనము మన పరలోకపు తండ్రిని పోలియున్నామా? ప్రజలు మనవైపు చూసి, "ఈయన తన పరలోకపు తండ్రిని పోలియున్నాడు" అని లేదా "ఈమె దేవుడేమిచేయునో దానిని చేయుచున్నదని" చెప్పగలరా? అది ఎంతో గొప్పదైన మెప్పుగా యుండును!

## దేవుని కవచమును ధరించుకొనుడి! (5:8–10)

ఈ విధంగా జీవించడానికి థెస్సలొనీకయులు ఎలా తమను తాము సిద్ధపరచుకొనగలిగిరి? సాతాను యొక్క సవాళ్ళను ఎదుర్కొనుటకు వారు ఎట్లు తమను తాము మెళుకువగా మరియు సిద్ధముగా ఉంచుకొనగలిగిరి? దేవుని వనరులను ఉపయోగించుకొనిరి. దేవుని పోలియుండడము అనునది సహజముగా వచ్చునది కాదు. వారు తమ సహజ కోరికలను అనుసరిస్తూ దేవునిని అనుసరించలేరు. వారు తమ సొంత కోరికలను సంతృప్తిపరచుకుంటూ దేవుని పిల్లలుగా యుండలేరు. "విశ్వాస ప్రేమలను కవచము, రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును ధరించినవారై" వారు (5:8బి) దేవుని సాధన సామగ్రిలను ఉపయోగించవలసినవారైయున్నారు. వారి కొరకైన దేవుని ముఖ్యమైన లక్ష్యమేమనగా, వారి రక్షణ; మరియు ఇదియే వారి యొక్క ముఖ్య లక్ష్యమైయుండవలసినదైయున్నది. దేవుడు వారికి సహకరించును.

దేవుడు మన రక్షణను కోరుకొనుచున్నాడు, అంధకారసంబంధమైన రాజ్యము యొక్క బెదిరింపులను ఎదుర్కొనులాగున ఆయన మనలను సిద్ధము చేయును. దేవుడు మనము ఎలాంటి సాధనములను ఉపయోగించాలని కోరుకొనుచున్నాడు? అవి విశ్వాసము, ప్రేమ, మరియు నిరీక్షణ.

మనము దేవునియందు నమ్మికయుంచినప్పుడు, ఆయనను మరియు మన సహోదరులను ప్రేమిస్తాము, మరియు మన నిత్యమైన సంక్షేపము కొరకు ఆయన వైపు చూస్తాము. మనము అంధకార సంబంధమైన లోకములో జ్యోతులవలే కనబడుదుము. మనము అంధకార సంబంధమైన రాజ్యమును మరియు దాని రాజునైన – సాతానును నిరోధించుదము, ఏ విధముగానైతే పిల్లలు తమ శ్రేయస్సు మరియు సంక్షేమము కొరకు తమ తల్లిదండ్రులను ప్రేమించి, నమ్మి వారిపై ఆధారపడుదురో, మనము కూడ మన జీవితములను తండ్రి చేతులలో పెట్టవలెను. "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింతయావత్తు ఆయనమీద వేయుడి" (1 పేతురు 5:7).

## ఒకనికొకడు ఆదరించుకొనుడి! (5:11)

దేవుడు మనకు తండ్రియై యున్నాడు కాబట్టి, మనము సహోదరులము మరియు సహోదరీలము! మనము దేవుని కుటుంబము. సంఘ సభ్యులముగా మన కుటుంబమునకు సహాయము చేయుటయనేది మన ముఖ్యమైన పాత్ర.

మన ఆత్మీయ సహోదరి మరియు సహోదరులకు సహాయము చేయుటకు దేవుడు మనలను ఆదేశించాడు, "... యొకనినొకడు ఆదరించి యొకనినొకడు క్షేమాభివృద్ధి కలుగజేయుడి"

(5:11). అదే మన ఉద్దేశమా? మనము మన సహోదరి మరియు సహోదరులవైపు చూసి “నీవు క్షేమాభివృద్ధి కలిగియుండులాగున నేను నిన్ను ప్రోత్సహించుచున్నాను” అని అనుకొనగలమా? “మీరు క్షేమాభివృద్ధి కలిగియుండులాగున నేను మిమ్మును ప్రోత్సహించుచున్నాను” అని దృఢమైన నిశ్చయతతోను వారిని సూటిగా చూస్తూ చెప్పగలవా? “నన్ను ప్రోత్సహించు సహోదరి, సహోదరులు నాకు ఉన్నారు గనుక నేను క్షేమాభివృద్ధి చెందగలను” అని మనలను గూర్చి చెప్పగల మన తోటి క్రైస్తవులున్నారా?

అంధకారముచే చుట్టూ ఆవరించబడిన వెలుగు సంబంధమైన రాజ్యములో ఈ క్రైస్తవులు కేవలము దేవుని రాజ్యములో భాగము మాత్రమే కాదు కానీ, దేవుని కుటుంబములో కూడ భాగమని దేవుడు క్రైస్తవులకు ఎల్లప్పుడు జ్ఞాపకం చేయాలనుకున్నాడు. మనలను ప్రోత్సహించుచున్న, బలపరచుచున్న, మనపై జాలిచూపుచున్న మరియు మనలను హెచ్చరించుచున్న మరియు మనలను ప్రేమించుచున్న సహోదరి మరియు సహోదరులతో నిండిన సంఘమును కలిగియుండుట కంటె, మరి దేనిచే భాగుగా జ్ఞాపకము చేయబడుదుము?

క్రైస్తవులముగా, మనము ఒంటరివారమనే ఆలోచనను, విడిచిపెట్టబడ్డామనే భావన, యితరులు మనలను గూర్చి లక్ష్యం చేయుట లేదు లేదా మనము దేనికి సరిపోము అనే ఆలోచనను చేయరాదు. మన తోటి క్రైస్తవులు మనలను తరచుగా బలపరచడం అనేది వారి పాత్రయైయుంది – కేవలము మనము జీవించాలనే కాదు కానీ, మనము నిలబడి, బలపరచబడి దానినిబట్టి మనము అభివృద్ధిచెందులాగున మరియు సంపూర్ణమగుటకు.

యిటువంటిది ఎల్లప్పుడు ఎందుకు సంఘములో జరుగుటలేదు? బహుశ ఈ రకమైన సహాయము యొక్క ప్రాముఖ్యతను మనము బోధించబడక పోయియుండవచ్చు, బహుశ మనము బోధించబడియుండవచ్చు కానీ ఈ సందేశమును మన జీవితములోను మరియు మన హృదయాలలోనికి తీసుకొనక పోయియుండవచ్చు. బహుశ మనము సహాయము చేయ వెదుకుటకు లేదా అందించుటకు కలవరపెట్టబడియున్నాము. బహుశ మన తోటి క్రైస్తవులకు ఒక ఖచ్చితమైన భయాలు లేకపోతే (ప్రభుత్వమునుండి హింసలు) వారు యిటు వంటి సహకారము యొక్క ప్రయోజనమును పొందక పోవచ్చునేమో అని అనుకుంటాము.

ఈ విషయములో దేవుడు కోరుకున్నది చేయుటయనేది, ప్రతి క్రైస్తవుని యొక్క ప్రతి కుటుంబము యొక్క, ప్రతి సంఘము యొక్క, ప్రతి పెద్ద యొక్క, ప్రతి సువార్తికుని యొక్క, ప్రతి బోధకుని యొక్క ఆలోచనయై యుండవలెను. దేవుడు తన కుటుంబములోని వారు ఈ విధముగా సహాయము చేస్తూ, సహాయము చేయబడాలని కోరుకొనుచున్నాడు. ఇట్టి సహాయము మనలను దేవుని రాకడకొరకు సిద్ధపరచును!

## ముగింపు

యేసు రాకడ ఈ జీవితమునకు ముగింపును మరియు ప్రతి నమ్మకమైన క్రైస్తవుని యొక్క మరింత మేలైన జీవితమునకు ప్రారంభముగా ఉండును. ఆ రాకడలోను మరియు దాని నూతన ప్రారంభములోను పాలుపంచుకొనుట ప్రతి క్రైస్తవుని గురియై యుండాలి – తనకును మరియు తన యొక్క సహోదరులకును గురియై యుండాలి.

ఆనందముతో ఆ సంఘటనను ఆశించుచున్నామా? ఇది నిజముగా జరగాలని మనము

కోరుకొనుచున్నామా? మనము కేవలము మన పెదవులతోనే కాక, మన మనస్సుతోను, మరియు మన జీవితముల ద్వారాను ప్రత్యుత్తరమివ్వాలి. మనము వెలుగు సంబంధులముగా జీవిస్తూ మన సహోదరి సహోదరులు దేవుని యొక్క వెలుగులో మనతోకూడ నడుస్తున్నప్పుడు వారికి సహకరించవలెను.